@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625
# నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || శుక్రవారం 14, మార్చి 2025 || పేజీలు: 04

## హామీలు నిలబెట్టుకుంటున్నాం

• అందుకే ఆ ముగ్గురికి ఎమ్మెల్సీ పదవులు ఇచ్చాం: సీఎం రేవంత్‌రెడ్డి 2

# విపక్షాల ఉచ్చులో పడను.. వాళ్లను పట్టించుకోను..

• గాంధీ కుటుంబంతో నాకెంతో సాన్నిహిత్యం ఉంది • వారిని కలిసినప్పుడల్లా ఫొటోలు దిగి ప్రదర్శించాల్సిన అవసరం నాకు లేదు • నాపై విశ్వాసం ఉండబట్టే పదవులు కట్టబెట్టారు • రేవంత్.. చెబితే చేస్తాడు.. ఎక్కడా రాజీ పడడు • కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడంలో తోడుగా ఉన్నోళ్లు మాకు ముఖ్యం • 37 మందిని కార్పొరేషన్ చైర్మన్లను చేశాం • రాష్ట్ర సమస్యలపై కిషన్‌రెడ్డి పోరాడాలి • బీఆర్ఎస్ పైశాచికానందం పొందుతోంది • శాసనసభలో చర్చకు కేసీఆర్ రావాలి ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్



న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 13: గాంధీ కుటుంబంతో తనకు ఎంతో సాన్నిహిత్యం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అందరూ అనుకునేదానికంటే ఎక్కువ సాన్నిహిత్యమే ఉందన్నారు. విపక్షాల ఉచ్చులో తాను పడబోనని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీకి, తనకు మధ్య దూరం పెరిగిందన్న ఆరోపణలను కొట్టిపారేశారు. "ఎవరో ఏదో అనుకుంటున్నారని నేను పట్టించుకోను. గాంధీ కుటుంబానికి నాపై ఎంతో నమ్మకం ఉంది కాబట్టే పీసీసీ అధ్యక్షుడు, ఆ తర్వాత ముఖ్యమంత్రిని చేశారు. విపక్షాలు మొదటి నుంచి అసత్య ప్రచారాలు చేస్తూనే ఉన్నాయి. కానీ, మంత్రివర్గం నుంచి రాజ్యసభ, ఎమ్మెల్సీల వరకు ఏం జరిగిందో చూశారు కదా? అయినా, గాంధీలను కలిసిన ప్రతిసారి ఫొటోలు దిగి చూపించాల్సిన అవసరం లేదు. నేను ఎవరి ట్రాప్‌లో పడను" అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. గురువారం ఢిల్లీలోని తన నివాసంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిలో పాల్గొన్నారు. కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రి కాబట్టే ఆయన్ని రాష్ట్ర సమస్యలపై అడుగుతున్నామని చెప్పారు. కిషన్‌రెడ్డికి కేంద్రంతో సత్సంబంధాలు ఉన్నాయని, వ్యక్తిగతంగానూ అందరితో పరిచయాలు ఉన్నాయని గుర్తు చేశారు. కేంద్ర మంత్రివర్గంలో ప్రతిఒక్కరూ వాళ్ల రాష్ట్రానికి సంబంధించి సమస్యలు లేవనెత్తుతారని, వాటిని సాధిస్తారని.. నిర్మలా సీతారామన్ చెన్నైకి మెట్రో తీసుకెళ్లారని తెలిపారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచిన కిషన్‌రెడ్డి మాత్రం తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అయినా, తామిచ్చిన (మిగతా 2లో..)

## డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

• 22న జెఏసి సమావేశానికి రేవంత్‌కు డిఎంకె ఆహ్వానం
• పార్టీ ఆదేశాలు తీసుకుని వస్తానని వెల్లడించిన రేవంత్
• తెలంగాణలో అంతకుముందే అఖిలపక్ష భేటీ
• భేటీకి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికీ ఆహ్వానం
• ఢిల్లీలో వెల్లడించిన సిఎం రేవంత్



న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 12: కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాలు తీసుకుని డిఎంకె నిర్వహించే జెఎసి సమావేశానికి హాజరవుతానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. డీలిమిటేషన్ దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగబోతోందన్నారు. దీనిపై తెలంగాణ కాంగ్రెస్ కూడా అఖిలపక్ష భేటీని ఏర్పాట చేసిందన్నారు. దీనికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కూడా ఆహ్వానించామని అన్నారు. కేంద్ర కేబినేట్‌లో ఉన్న (మిగతా 2లో..)



# మోసం చేసి నా పార్టీని విలీనం చేసుకున్నారు

• బీజేపీ, బీఆర్ఎస్‌కు సేవలందించా..
• ఆ పార్టీలు సరైన నిర్ణయాలు తీసుకోలేదు..
• అందుకే ఆ పార్టీలను వీడాల్సివచ్చింది.. • గాంధీ భవన్‌లో విజయశాంతి సంచలన వ్యాఖ్యలు..

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 13: బీజేపీ, బీఆర్ఎస్‌కు తాను సేవలు అందించానని, ఆ పార్టీలు సరైన నిర్ణయాలు తీసుకోలేదు కాబట్టే వాటిని వీడినట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు విజయశాంతి చెప్పారు. తన పార్టీని విలీనం చేయించుకుని మోసం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యారు. విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్ ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముగ్గురికీ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం వారంతా నేరుగా గాంధీ భవన్‌కు చేరుకుని మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన విజయశాంతి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీగా బీఆర్ఎస్, బీజేపీ నేతల బండారం బయటపెడతానని భయం అవుతోందా?. నా వల్ల హార్ట్ ఎటాక్ వస్తుందని భయపడుతున్నారా?. నా పార్టీని విలీనం చేయించుకుని నన్ను మోసం చేశారు. విజయశాంతికి, తెలంగాణకి సంబంధం ఏంటని కొంతమంది ప్రశ్నిస్తున్నారు. నాకు, తెలంగాణకు సంబంధం లేదా?. నేను తెలంగాణ ఉద్యమం మొదలుపెట్టినప్పుడు టీడీపీలో కేసీఆర్ ఉన్నారు. తెలంగాణ కేసీఆర్ సొత్తు కాదు. తెలంగాణ రాష్ట్ర సాధనకు నా వంతు కృషి చేశా. తెలంగాణ ఇస్తున్న సమయంలో కేసీఆర్ పార్లమెంటులో లేరు. కేసీఆర్ తన దొరబుద్ధి నిరూపించుకుంటున్నారు. దొరలు ఓటేస్తేనే కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారా?. నింద వేయడం కాదు నిరూపించాలి. నేను గట్స్ ఉన్న మహిళని. ప్రతిరోజూ నన్ను అవమానించారు. హింసపెట్టి పార్టీని విలీనం (మిగతా 2లో..)

## ప్రశ్నిస్తే.. తట్టుకోలేక సస్పెన్షన్

• జగదీశ్ రెడ్డి ప్రశ్నిస్తే.. తట్టుకోలేక సస్పెన్షన్ • సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిరసన • స్పీకర్‌ను ఉద్దేశించి అగౌరవంగా ఏమీ మాట్లాడలేదు • నిబంధనలకు విరుద్ధంగా సభలో మాట్లాడలేదు • ప్రజల గళాన్ని మూసే ప్రయత్నం • బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 2



## రేపటి నుంచి ఒంటి పూట బడి

• వేసవి ప్రారంభంలోనే సూర్యు ప్రతాపం



హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 13: వేసవి ప్రారంభంలోనే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఒంటిపూట బడులను నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈనెల 15 నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉదయం మాత్రమే తరగతులు నిర్వహించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు మాత్రమే తరగతులను నిర్వహించాలని సూచించింది. మధ్యాహ్నం 12.30 గంటలకు విద్యార్థులకు భోజనం అందించాలని సూచించింది. పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసిన పాఠశాలల్లో పరీక్ష నిర్వహించిన తర్వాత మధ్యాహ్నం 1 గంట నుంచి (మిగతా 2లో..)

## సభ అందరిదీ.. మీ సొంతం కాదు

• స్పీకర్‌ను ఉద్దేశించి జగదీశ్ రెడ్డి అహంకారపూరిత వ్యాఖ్యలు
• అసెంబ్లీలో దుమారం • బేషరతు క్షమాపణలకు కాంగ్రెస్ డిమాండ్
• గందరగోళం మధ్య సభ 15 నిముషాలు వాయిదా 2



## తెలంగాణలో 5ఎమ్మెల్సీ స్థానాలు ఏకగ్రీవం

• కాంగ్రెస్ నుండి ముగ్గురు, బీఆర్ఎస్, సీపీఐ నుండి ఒక్కొక్కరు చొప్పున ఏకగ్రీవం • ఐదు నామినేషన్లు రావడంతో ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటన 2

నేటి ఫోకస్ న్యూస్
శుక్రవారం 14, మార్చి 2025

# విపక్షాల ఉచ్చులో పడను.. వాళ్లను పట్టించుకోను..

(మొదటి పేజీ తరువాయి..)

ఆరు గ్యారెంటీల గురించి కేంద్రాన్నేమీ అడగడం లేదని, ప్రధాని మోదీ ప్రకటించిన.. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో గురించే అడుగుతున్నామని తెలిపారు. తెలంగాణ సమస్యలపై పోరాడాల్సిన బాధ్యత కిషన్‌రెడ్డికి ఉందన్నారు. హిందీ ఎక్కువ మంది మాట్లాడే భాషేనని, జాతీయ భాష కాదని పునరుద్ఘాటించారు. హిందీ తర్వాత తెలుగే ఎక్కువగా మాట్లాడతారన్నారు. హిందీని దక్షిణాదిపై రుద్దడంలో బీజేపీకి ఏదో రహస్య అజెండా ఉందని ఆరోపించారు. తాను చెబితే కచ్చితంగా చేస్తానని, ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడనని రేవంత్ రెడ్డి తెలిపారు. "రేవంత్.. చెప్తే చేస్తాడు. పీసీసీ అధ్యక్షుడిగా ఇచ్చిన ప్రతిమాటను నెరవేర్చాను. సీఎం పదవి వచ్చిన తర్వాత ఎంతోమంది వస్తుంటారు. కానీ.. కొట్లాడేటప్పుడు, ఉద్యమాలు చేసేటప్పుడు ఎవరైతే మనతో ఉంటారో, వాళ్లకు అండగా ఉండాలి. కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో మనతో ఉన్నోళ్లు ముఖ్యం కదా? సమయాన్ని బట్టి అందరికీ న్యాయం చేస్తానని చెప్పా. అలాగే, చేస్తున్నా. కాంగ్రెస్ కోసం పనిచేసిన 37 మందికి ఒకేసారి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చా. గతంలో ఎప్పుడైనా ఇలాంటి పరిస్థితిని చూశామా? ఇచ్చిన హామీలో భాగంగానే అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్ నాయక్‌కు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించాం. విజయశాంతి ఎమ్మెల్యేగా పోటీ చేయనని, ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని కోరింది. శంకర్ నాయక్ ఎమ్మెల్యే సీటు కావాలని అడిగితే ఇవ్వడం కుదరదని చెప్పా. ఎమ్మెల్సీని చేస్తానని.. అప్పటి వరకు పార్టీ కోసం కష్టపడి పనిచెయ్యాలని సూచించా. అన్నట్టుగానే ఎమ్మెల్సీని చేశా. ఇలా.. ఇచ్చిన ప్రతిమాటను నెలబెట్టుకుంటున్నా. ఒక ట్రాక్ రికార్డు ఉండాలి కదా? రేవంత్ చెబితే చేస్తాడనే నమ్మకం కేడర్‌లోనూ, ప్రజల్లోనూ ఉండాలి. అందుకే కేడర్‌ను బలోపేతం చేస్తూనే, హామీలు అమలు చేస్తున్నా" అని రేవంత్ తెలిపారు. పదేళ్లలో బీఆర్ఎస్ తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అదే విషయాన్ని ప్రజలకు చెప్పానన్నారు. రూ.7 లక్షల కోట్ల అప్పు ఉందని, దశలవారీగా హామీలు అమలు చేస్తానని చెప్పానని, అందులో తప్పేముందని ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పడం, ప్రజలను మభ్యపెట్టడం తనకు చేతకాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు



అవుతున్నా, ప్రభుత్వ ఏర్పాటు, యంత్రాంగం తదితర విషయాలన్నింటినీ సరిచేసుకుని.. సీఎంగా పనిచేసింది ఎనిమిది నెలలేనని చెప్పారు. ఈ కొద్ది సమయంలోనే రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలెండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.10 లక్షల ఆరోగ్య సేవలు.. ఇలా ఎన్నో పథకాలను అమలు చేశానని తెలిపారు. నిరుద్యోగ రేటును గణనీయంగా తగ్గించానని, సొంత పన్నుల రాబడిలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపానని గుర్తుచేశారు. ఐదేళ్ల తర్వాత ఎన్నికలకు వెళితే 'రేవంత్ చెబితే చేస్తాడు'.. అనే నమ్మకంతో ప్రజలు ఓటేయాలని, ప్రస్తుతం అదే చేస్తున్నానని వివరించారు.

**కేసీఆర్ అసెంబ్లీలో చర్చకు రావాలి..**

కేసీఆర్ గవర్నర్ ప్రసంగానికి రావడం కాదని, అసెంబ్లీలో చర్చలకు రావాలని రేవంత్‌రెడ్డి సూచించారు. పదేళ్లలో రాష్ట్రాన్ని తుప్పు పట్టించారని, ఇప్పుడిప్పుడే ఆ తప్పును వదిలిస్తూ ముందుకెళుతున్నానని చెప్పారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు ఇలాగే చేశారని తెలిపారు. వారికి గత పాలనలో జరిగిన నష్టాన్ని సరిచేయడానికి రెండేళ్ల సమయం పట్టిందని గుర్తుచేశారు. కేసీఆర్ పదేళ్లలో ఒక్క కొత్త పాలసీనీ తీసుకురాలేదని చెప్పారు. కానీ, తాను అతి తక్కువ సమయంలో కులగణనను పూర్తి చేశానన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు కులగణన చేయడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. ఏపీలోనూ బీజేపీ మిత్రపక్షమే అధికారంలో ఉందని, అక్కడెందుకు కులగణన చేయడం లేదని నిలదీశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నేతల పరిస్థితి రోజురోజుకూ దారుణంగా తయారవుతోందన్నారు. రైతుల పంటలు ఎండిపోతే, టన్నెల్ ప్రమాదంలో ఎవరైనా చనిపోతే బీఆర్ఎస్ నేతలు డప్పులు వాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అది వారి పైశాచిక ఆనందమని తెలిపారు. మామునూరు విమానాశ్రయానికి భూసేకరణ పూర్తయిందని, ఆ తర్వాత ఆదిలాబాద్, కొత్తగూడెం.. ఇలా అన్నింటికీ మార్గం సుగమం అవుతుందని అన్నారు.

**కేసీఆర్ గవర్నర్ ప్రసంగానికి కాదు.. చర్చకు రావాలి**

మాజీ సీఎం కేసీఆర్ చర్చకు రాకుండా గవర్నర్ ప్రసంగానికి వస్తే ఏం లాభమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఒకవేళ చర్చకు వస్తే వారే చేసిన తప్పులేంటే వివరించే అవకాశం ఉంటుందని.. తద్వారా ప్రజలకు తెలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. చర్చకు రాకుండా గవర్నర్ ప్రసంగానికి వస్తే అర్థం ఏంటని ప్రశ్నించారు. కేసీఆర్ వ్యవహార శైలిని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ ఒక్క పాలసీ తేలేదన్నారు. తెలంగాణలో తాను చేసినన్ని పాలసీలు ఎవ్వరూ చేయలేదని పేర్కొన్నారు. నిరుద్యోగాన్ని 8.8 నుంచి 6.1 శాతానికి తగ్గించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి నాటి నుంచి రూ.2.2 లక్షల కోట్ల పెట్టుబడులను తెలంగాణకి తెచ్చినట్లు వెల్లడించారు. పన్ను వసూళ్లలోనూ తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందంటూ రేవంత్ తెలిపారు. రైతుల పొలాలు ఎండిపోతుంటే, టన్నెల్?లో ప్రాణాలు పోతుంటే, ప్రజలు కష్టాల్లో ఉంటే బీఆర్ఎస్ నేతలు డ్యాన్సులు వేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ కుటుంబంతో తనకు మంచి అనుబంధం ఉందని, ఫొటోలు దిగి చూపించాల్సిన అవసరం లేదంటూ సీఎం రేవంత్ అన్నారు. తానేవరూ తెలికుండానే పీసీసీ, ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించారా? అంటూ ప్రతిపక్షాలను ప్రశ్నించారు. గాంధీ కుటుంబంతో తనకు విభేధాలు వచ్చే అవకాశమే లేదని తేల్చి చెప్పారు రేవంత్. తెలంగాణ సీఎంగా ఉన్నా కాబట్టే రాష్ట్రంలో తనను ప్రశ్నిస్తున్నారని, అలాగే కేంద్రమంత్రిగా కిషన్ రెడ్డి ఉన్నారు కాబట్టే ఆయన్నీ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన అంశాలపై ప్రశ్నిస్తున్నారని అన్నారు. మిగతా రాష్ట్రాల కేంద్రమంత్రులు వారివారి రాష్ట్రాలకు కావాల్సినవన్నీ సాధించుకుంటున్నారని, కానీ కిషన్ రెడ్డి మాత్రం తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులు, నిధుల గురించి పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తాను ఆరు గ్యారెంటీలు అడగడం లేదని, తెలంగాణకు ప్రధాని ప్రకటించిన రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో, మూసీ, కేంద్ర ప్రాజెక్టులు మాత్రమే అడుగుతున్నట్లు చెప్పుకొచ్చారు. మెట్రోకి క్యాబినెట్ అనుమతి వస్తే పనులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు చెప్పుకొచ్చారు. హైదారాబాద్ గేమ్ ఛేంజర్ మెట్రో అంటూ రేవంత్ చెప్పుకొచ్చారు.

**ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటున్నాం**

మేము ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలతోపాటు పార్టీలో కీలకంగా పనిచేసిన వారికి ఇచ్చిన మాటను నిబెట్టుకుంటున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్లు రానివారికి అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయం చేస్తానని హామీ ఇచ్చానని.. అవన్నీ ఇప్పుడు అమలు చేస్తున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. గురువారం ఢిల్లీలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడుతూ.. పార్టీ అనుబంధ విభాగాల్లో పని చేసిన వారికి ఒకేసారి 37 కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చానన్నారు. అలాగే అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్ నాయక్‌కు ఎమ్మెల్సీలు ఇచ్చామన్నారు. డీసీసీ అధ్యక్షులందరికీ పదవులు ఇచ్చామని తెలిపారు. గాంధీ కుటుంబంతో తనకు అనుబంధం అంతకు మించి ఉందని.. ఫొటోలు దిగి చూపించాల్సిన అవసరం లేదన్నారు. కేంద్ర కేబినెట్‌లో ఉన్న నిర్మలా సీతారామన్ గతంలో తమిళనాడుకు మెట్రో ప్రకటనలో కీలక పాత్ర పోషించారన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాత్రం తెలంగాణ రాష్ట్రం అంశాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు 253 ఎకరాల భూసేకరణ పూర్తి చేస్తామన్నారు. మెట్రో, మూసీ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతిస్తే సరిపోతుందని.. బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. తెలంగాణలో ఏప్రిల్ నెలలో మూడు రోజుల పాటు భారత్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 60 దేశాల నుంచి అతిథులను ఆహ్వానిస్తున్నామన్నారు. దానికి కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి అనుమతి కావాలని.. అందుకే విదేశాంగ శాఖ మంత్రిని కలుస్తున్నట్లు తెలిపారు. డీలిమిటేషన్ విధానంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జానారెడ్డి నేతృత్వంలో కమిటీ వేశానన్నారు. దానికి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డిని ఆహ్వానిస్తున్నామన్నారు. తెలంగాణలో అందరి అభిప్రాయాన్ని సేకరించి ఆ తర్వాత డీఎంకే మీటింగ్‌లో తమ వైఖరి చెప్తామన్నారు. పన్నులు వసూలులో దేశంలో మొదటి స్థానంలో తెలంగాణ ఉందన్నారు. బీఆర్ఎస్ నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు.

# ప్రశ్నిస్తే.. తట్టుకోలేక సస్పెన్షన్

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 13:**

బీఆర్ఎస్ శాసనసభ్యుడు జగదీశ్ రెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేయడంపై తీవ్ర రాజకీయ దుమారం రేగింది. ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిరసనలు చేపట్టారు. సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఆందోళన సభలో అనని మాటలు అన్నట్టుగా చిత్రీకరించి తప్పుడు ఆరోపణల ఆధారంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనపై వేటు వేసిందని బీఆర్ఎస్ ఆరోపించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా, ప్రజల సమస్యలను లేవనెత్తకుండా మా గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్నారు. గవర్నర్ ప్రసంగంలోని అసత్యాలను ఎత్తి చూపినందుకు జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేయడం దుర్మార్గం. మేము ప్రతిపక్ష



హక్కులను కాపాడుకునేందుకు పోరాడుతాం," అని తెలిపారు. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన బీఆర్ఎస్, రేపు అన్ని నియోజకవర్గాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్లు ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేయనున్నట్లు తెలిపారు. కేటీఆర్ ఆరోపణలు చేస్తూ, "సభను ఐదు గంటలు వాయిదా వేసి ఢిల్లీలో ఉన్న రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ చర్య తీసుకున్నారు. సస్పెన్షన్‌కు ముందు జగదీశ్ రెడ్డికి వివరణ చెప్పే అవకాశం కూడా ఇవ్వలేదు. ఇది ప్రభుత్వ అసహనం, నియంతృత్వ పోకడకు నిదర్శనం," అని మండిపడ్డారు. "ఒక గొంతును నొక్కితే ప్రశ్నలు ఆగవు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ అసలు ముసుగును గుర్తించారు. 20% కమీషన్లు ఢిల్లీకి పంపడం తప్ప, ప్రజలకు మేలు చేయాలని ఈ ప్రభుత్వం ఆలోచించడం లేదు. ప్రజల కోర్టులో తప్పకుండా శిక్ష పడుతుంది," అని కేటీఆర్ హెచ్చరించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌ను కలిసి ప్రతిష్టంభన తొలగించేందుకు అన్ని పార్టీల అభిప్రాయం తీసుకోవాలని సూచించినట్లు కేటీఆర్ తెలిపారు. "సభ సజావుగా సాగాలని మేము కోరుకుంటున్నాం. కానీ ప్రభుత్వ నిరంకుశ వైఖరి ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారింది," అని ఆయన అన్నారు.

**కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాటం**

బీఆర్ఎస్ శాసనసభ సమావేశాల్లో ప్రజల తరఫున గట్టిగా ప్రశ్నిస్తుందని, అందుకే తమ గొంతును నొక్కేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. భవిష్యత్తులో ప్రజలు దీని గురించి ఖచ్చితంగా సమాధానం అడుగుతారని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు.

# తెలంగాణలో 5 ఎమ్మెల్సీ స్థానాలు ఏకగ్రీవం







**హైదరాబాద్ ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 13:**

తెలంగాణలో ఎమ్మెల్యే కోటాలో ఖాళీ అయిన ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో మొత్తం ఐదు నామినేషన్లు మాత్రమే దాఖలవడంతో పోటీ లేకుండానే అభ్యర్థుల ఎన్నిక ఖరారైంది. ఈ విషయాన్ని ఎన్నికల అధికారి అధికారికంగా ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ నుండి విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, బీఆర్ఎస్ తరఫున దాసోజు శ్రవణ్, సీపీఐ తరఫున నెల్లికంటి సత్యం ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారు. వీరి అభ్యర్థిత్వాన్ని ఎన్నికల అధికారులు ధృవీకరించారు. అయితే ఈ ఎన్నికల్లో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్ దాఖలు చేసినప్పటికీ, నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో రిటర్నింగ్ అధికారి వాటిని తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు నేటి సాయంత్రం 5 గంటలకు ముగిసింది. గడువు ముగిసే సమయానికి ఎవరు కూడా తమ నామినేషన్లను ఉపసంహరించుకోకపోవడంతో, పోటీ లేకుండానే ఐదుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ఫలితాలతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త మార్పులు చోటుచేసుకునే అవకాశముందన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# మోసం చేసి నా పార్టీని విలీనం చేసుకున్నారు

(మొదటి పేజీ తరువాయి..)

చేయించుకున్నారు. ఇద్దరి ఆశయం తెలంగాణ రాష్ట్రం అయినప్పుడు రెండు పార్టీలు ఎందుకని అనుకున్నాం. ఏడు లక్షల కోట్ల అప్పు ఎలా అయ్యిందో విడిచిపెట్టకుండా కేసీఆర్‌ని అడగాలి. కేసీఆర్ మోసాలన్ని బయటకి తీయాలి. ఆయన ఇప్పటికైనా వాస్తవాలు మాట్లాడాలి. మేం కష్టపడి తెచ్చుకున్న రాష్ట్రం ఇది. తెలంగాణ వ్యతిరేకులని బీజేపీ రాష్ట్రంలో దించబోతోంది. బాంచన్ కాళ్లు మొక్కుతా అనే పరిస్థితికి మళ్లీ తెలంగాణను తీసుకెళ్లాలని బీజేపీ కసరత్తు చేస్తోంది. తెలంగాణ వ్యతిరేకి మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి. ఆయన బీజేపీలోకి వచ్చినందుకు ఆ పార్టీని వదిలేశా. సోనియా గాంధీ నాకు ఎమ్మెల్సీ ఇచ్చింది. కాపల కుక్కలాగా ఇప్పటివరకూ తెలంగాణని కాపాడుకున్నాం. ఇకపై అలాగే కాపాడుకుంటామని" చెప్పారు.

# సభ అందరిదీ.. మీ సొంతం కాదు

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 13:**

తెలంగాణ అసెంబ్లీలో భారాస ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగింది. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై చర్చ సందర్భంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు ఆయన క్షమాపణ చెప్పాలని మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. తొలుత జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి మాట్లాడారు. 'ఈ సభ అందరిదీ.. సభ్యులందరికీ సమాన అవకాశాలు ఉన్నాయి. మా అందరి తరఫున పెద్ద మనిషిగా, స్పీకర్‌గా మీరు కూర్చున్నారు. ఈ సభ మీ సొంతం కాదు' అని వ్యాఖ్యానించారు. సభా సంప్రదాయాలకు విరుద్ధంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడారని స్పీకర్ ఆక్షేపించారు. జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. స్పీకర్‌ను దూషించేలా ఆయన మాట్లాడారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. జగదీశ్‌రెడ్డి మాట్లాడిన ప్రతి పదాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన అహంకారంతో మాట్లాడకుండా క్షమాపణ చెప్పాల్సిందేనన్నారు.

# రేపటి నుంచి ఒంటి పూట బడి

(మొదటి పేజీ తరువాయి..)

సాయంత్రం 5 గంటల వరకు తరగతులను నిర్వహించాలని పేర్కొంది. ఈ విద్యాసంవత్సరం చివరిరోజైన ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించింది. జూన్ 12న పాఠశాలలను పునః ప్రారంభిస్తారు.

**12.30కు మధ్యాహ్న భోజనం:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, తరగతుల నిర్వహణ అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయాలని సూచించింది. దీనితో ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఒంటి పూట బడుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశారు. రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా విద్యార్థులకు ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నామని, తల్లిదండ్రులు, విద్యార్థులు సహకరించాలని సూచించారు. పదవ తరగతి పరీక్షా కేంద్రాలున్న పాఠశాలల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని సూచించినందున ఆ సమయంలో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉంటుంది. ఆ సమయంలో పాఠశాలకు వెళ్లడం, ఇంటికి పిల్లలను తీసుకురావడం ఇబ్బందిగా ఉంటుందని తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

**21 నుంచి పదో తరగతి పరీక్షలు:** పదో తరగతి వార్షిక పరీక్షలు ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులకు డిసెంబరు నుంచే ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో ఫర్నీచర్, గాలి, వెలుతురు, మంచినీటి వసతి, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతులు ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున పరీక్షా కేంద్రాల్లో వైద్యశిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. పరీక్షా సమయానికి ఐదు నిమిషాల ఆలస్యంగా వచ్చిన వారిని పరీక్ష రాసేందుకు అనుమతించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# మీకు కేసీఆర్ ఇదే నేర్పించారా?

- జగదీష్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు బాధాకరం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే వ్యవహారశైలి తప్పు
- పెద్దల సభలో ఇలాంటి తీరును ఎలా సహించగలం?
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 13:**

శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర నిరసనకు కారణమయ్యాయి. ఈ ఘటనపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సభాపతిపై చేసిన అసభ్య వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పేటుతో సమానం అని ఆయన అన్నారు. శాసన సభ సమావేశాల్లో జగదీష్ రెడ్డి వ్యవహార శైలిని ఖండిస్తూ భట్టి విక్రమార్క మాట్లాడుతూ, "సభాపతిగా మీరు కేవలం పెద్ద మనిషిగా కూర్చున్నారు కానీ ఈ సభ మీ సొంతం కాదన్నట్టుగా మాట్లాడటం చరిత్రలో ఎన్నడూ జరగలేదు. ఇది ప్రజాస్వామ్యానికి అవమానం," అని అన్నారు. ఈ వ్యవహారంపై ఎథిక్స్ కమిటీకి నివేదించి, వారి సూచన మేరకు తగిన చర్యలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. భట్టి విక్రమార్క తన ప్రసంగంలో బీఆర్ఎస్ ఎల్పీ సమావేశాన్ని ప్రస్తావిస్తూ, "కేసీఆర్ ఈ రకమైన రాజకీయాలను నేర్పించారా? సభా సాంప్రదాయాలను దిగజార్చేలా మీ వ్యాఖ్యలు ఉండటమే కాక, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే ప్రయత్నం చేస్తున్నారు," అని మండిపడ్డారు. ప్రజాప్రతినిధిగా ఉన్న ఒకరు, సభా అధ్యక్షుడిని అవమానించడాన్ని ప్రజాస్వామ్యం ఎలా అంగీకరిస్తుందో అని ప్రశ్నించారు. ఈ పరిణామంపై అసెంబ్లీలో ఇతర సభ్యులు కూడా ముక్తకంఠంతో స్పందించారు. "పెద్దల సభలో ఇలాంటి తీరును ఎలా సహించగలం? సభా గౌరవాన్ని కాపాడేందుకు కఠిన నిర్ణయాలు తీసుకోవాలి," అంటూ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరికొందరు సభ్యులు "మూడ్ ఆఫ్ ది హౌస్" ప్రకారం జగదీష్ రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. "పార్లమెంటరీ వ్యవస్థ పరువు కాపాడేందుకు తప్పనిసరిగా కఠిన చర్యలు తీసుకోవాలి. సభాసాంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అర్థమయ్యేలా కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది," అని అన్నారు.

# డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

(మొదటి పేజీ తరువాయి..)

కిషన్ రెడ్డి దక్షిణాది రాష్ట్రాల ఇబ్బందులను కేంద్రానికి తెలియచేయాల్సి ఉందన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న రేంవత్‌ని ఈ నెల 22న జరగనున్న జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి హాజరు కావాలని తమిళనాడు డీఎంకే నేతలు ఆహ్వానించారు. ఈ క్రమంలో జేఏసీ సమావేశానికి రేవంత్ రెడ్డి రావాలని డీఎంకే ఎంపీలు కనిమొళి, రాజా, ఎన్. ఇలాంగో, కళానిధి వీరస్వామి సీఎంను కలిసి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. స్టాలిన్ డీలిమిటేషన్ విషయంలో చూపిన చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. తమిళనాడులో సమావేశానికి హాజరయ్యేందుకు ఏఐసీసీ అనుమతి తీసుకుని వస్తామన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ దక్షిణాది రాష్ట్రాలపై ప్రభావం చూపుతుందని, ఉత్తరాది రాష్ట్రాల కంటే ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నాయని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో కూడా డీలిమిటేషన్ పై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి కూడా రావాలని కోరుతున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో కిషన్ రెడ్డి తన అభిప్రాయాలను కేంద్ర క్యాబినెట్‌లో వినిపించాల్సిన అవసరం ఉందని రేవంత్ ప్రస్తావించారు. తెలంగాణలోని అన్ని పార్టీలు కూడా ఆ సమావేశంలో పాల్గొనాలని కోరారు. ఈ క్రమంలో డీలిమిటేషన్ పై మార్చి 22న జరుగనున్న జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి ముఖ్యమంత్రికి ఆహ్వానం అందింది. తమిళనాడులో జరగనున్న ఈ సమావేశానికి పలు ప్రాంతీయ పార్టీలు హాజరై డీలిమిటేషన్ పై వారి అభిప్రాయాలను తెలియజేయనున్నాయి. ఇప్పటికే డీలిమిటేషన్ పై తమిళనాడు డీఎంకే నేతలు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ తమ రాష్ట్రంలో ప్రజల హక్కులను హరించే దిశగా ఉందని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో తెలంగాణ సీఎం రేవంత్ కూడా ఈ అంశంపై చర్చిస్తామన్నారు.

# అప్పులున్నా అభివృద్ధి ఆగడం లేదు

## సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం

### బిజెఎల్‌పి నేత ఏలేటి వ్యాఖ్యలపై పొన్నం ఆగ్రహం



హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 12:

తెలంగాణ శాసన సభలో బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటుగా స్పందించారు. ప్రభుత్వ విధానాలపై బీజేపీ నిరాధార ఆరోపణలు చేస్తున్నదని ఆయన ఆరోపించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, 'మేము ఏ పథకాన్ని నిలిపివేయలేదని స్పష్టంగా చెప్పగలము. ప్రభుత్వం కొత్త ఉద్యోగ నియామకాలకు ప్రాధాన్యత ఇస్తోంది. కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులకు విద్యాబోధన సక్రమంగా అందించాలని సూచిస్తున్నాం' అని చెప్పారు. నిజానికి అప్పులు ఉన్నాయనే విషయం మాకు తెలుసు. అయితే, ఆర్థిక వ్యవస్థీకరణ చేస్తున్నాం. తెలంగాణ ఆర్థికంగా ఎదిగిపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ పరిపాలన అనుభవం కలిగినది, పాత పథకాలను కొనసాగించడంతో పాటు కొత్త పథకాలను కూడా అమలు చేస్తున్నాం' అని ఆయన వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ బీజేపీపై విమర్శలు గుప్పిస్తూ, 'కేంద్రం పెద్దన్న లాగా రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలి. బీజేపీ నేతలు తులం బంగారం గురించి మాట్లాడుతున్నారు. 15 లక్షల రూపాయలు అందిస్తామని చెప్పారు, ఏమైపోయాయి? రైతులకు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారు, కానీ వారి కోసం ఉరి చట్టాలు తీసుకొచ్చారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు' అని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రం నుండి వచ్చే నిధులను కేంద్రం తిరిగి ఇవ్వడం లేదు. పైగా, బాత్రూంలపై, రేషన్ షాపులపై బీజేపీ నేతల ఫోటోలు పెట్టాలని చెబుతున్నారు' అని మంత్రి మండిపడ్డారు. 'రైతు రుణమాఫీపై బీజేపీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది.

కానీ, తెలంగాణ ప్రభుత్వం నిర్మల్ నియోజకవర్గంలో 23,906 మంది రైతులకు రూ.202.55 కోట్ల రుణ మాఫీ చేసింది. రెండు లక్షల లోపు రుణమాఫీ అమలు చేయడం ద్వారా రైతులకు మద్దతుగా నిలుస్తున్నాం. నిర్మల్‌కు వచ్చి దీనిపై చర్చించడానికి మేము సిద్ధంగా ఉన్నాం' అని మంత్రి స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రభుత్వం సంక్షేమాన్ని ఒక్క అడుగు కూడా తగ్గించదని, అభివృద్ధే తమ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బీజేపీ అనవసర విమర్శలు చేయడం మానేసి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని సూచించారు.

## ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో దుర్మార్గాలను ఎదుర్కొన్నం

### ఈ సస్పెనషన్ ఓ లెక్క కానేకాదు: జగదీశ్ రెడ్డి

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 12:



ఉమ్మడి రాష్ట్రం నుంచి ఎన్నో దుర్మార్గాలను ఎదుర్కొని వచ్చామని.. ఈ సస్పెన్షన్ తనను ఏమాత్రం భయంపెట్టలేదని సూర్యాపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ సభ్యులతో కలిసి అంబేద్కర్ భారీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ రోజు రాష్ట్రంలో ఏం జరుగుతుందో.. శాసనసభలో ఏం జరుగుతుందో ప్రజలంతా చూశారు. మేం మాట్లాడుతున్న సందర్భంలో దురదృష్టవశాత్తు.. శాసనసభలో ప్రతిపక్ష పార్టీకి సంబంధించిన సభ్యులు మాట్లాడుతున్న దాన్ని లైవ్ కూడా ఇవ్వడం లేదని ప్రజలు మాకు చెబుతున్నరు. అయినప్పటికీ ఈ ప్రభుత్వం నిజాలు దాచిపెడుతామనుకుంటే సాధ్యం కాదని అన్నారు. శాసనసభలో ఒక్కరోజు కూడా అన్‌పార్లమెంటరీ వర్డ్ కానీ, ఇతరులను కించపరిచేవిధంగా, శాసనసభ హుందా తనాన్ని తగ్గించే విధంగా కానీ నేను ఎప్పుడూ మాట్లాడలేదు. ప్రత్యేకించి చైర్‌కు సంబంధించి.. స్పీకర్ అధికారాలు ఏందో.. స్పీకర్ విధులు ఏంటో అన్నీ నాకు తెలుసు. ఎక్కడా కూడా స్పీకర్ గౌరవానికి భంగం కలిగించే పద్ధతుల్లో మాట్లాడలేదు. ఇది కేవలం ప్రభుత్వ కుట్ర. ఈ చర్యకు స్పీకర్ సమ్మతిస్తరని నేను అనుకోవడం లేదు. ఎంత దురదృష్టకరమంటే.. జరిగింది చర్చ నాకు, కాంగ్రెస్ పార్టీకి మధ్యన. స్పీకర్ పెద్దమనిషిగా.. రెఫరీగా ఉంటారు కాబట్టి.. ఆయనను పదేపదే రిక్వెస్ట్ చేశాను. కాంగ్రెస్ సభ్యులు ఇద్దరు 1.20గంటలు మాట్లాడారు. అప్పుడు మా సభ్యులు అభ్యంతరం తెలుపలేదు.. వారు సాఫీగా మాట్లాడుకున్నరు' అని తెలిపారు. స్పీకర్ నాకు అవకాశం ఇచ్చారు. బీఆర్ఎస్ తరఫున మాట్లాడేందుకు కేసీఆర్ నాకు అవకాశం ఇచ్చారు. నేను దానికి సంబంధించి రాత్రి జిల్లాలోని రైతులు, అన్నివర్గాల ప్రజలతోని మాట్లాడాను. వాళ్ల సమస్యలను ఎలా ప్రతిబింబించాలి.. రాష్ట్రంలో ఎండిపోతున్న పొలాలు, అక్కడ రైతులు చెబుతున్న బాధలు.. వివిధ వర్గాల ప్రజలు ఎలా మోసపోయోమని చెబుతున్నరో.. వాటన్నింటిని శాసనసభలో మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేశాను. అందులో ఎక్కడా ఒక్క తప్పుమాట, పొరపాటు మాట.. స్పీకర్‌ను కించపరిచే మాట లేదు. ప్రభుత్వాన్ని నిలదీసే మాట ఉంది. ప్రభుత్వం బట్టలు విప్పే మాట ఉంది.. ఉండి తీరుతుందని అన్నారు. ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రతిపక్షంగా మా బాధ్యత అన్నారు. శాసనసభలో ఆపినంత మాత్రానా.. ప్రజాక్షేత్రంలో మమ్మల్ని ఆపలేరు' అని జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు.

## తెలంగాణలో ఐదు ఎమ్మెల్సీలు ఏకగ్రీవం

### ఎట్టకేలకు చట్టసభలోకి దాసోజు శ్రవణ్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 12:

తెలంగాణలో ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఐదు స్థానాలకు 5 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్‌నాయక్, భారాస నుంచి దాసోజు శ్రవణ్, సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం ఎన్నికయ్యారు. వీరు కాకుండా ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు నిబంధనల మేరకు లేకపోవడంతో రిటర్నింగ్ అధికారి వాటిని తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం సాయంత్రం 5గంటలకు ముగిసింది. దీంతో ఐదుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. దాసోజు శ్రవణ్ ఎట్టకేలకు చట్టసభలో ప్రవేశించే అవకాశం దక్కించుకున్నారు. గతంలో గవర్నర్ కోటాలో దాఓజును నామినేట్ చేసినా ఆనాటి గవర్నర్ తమిళసై తిరస్కరించడంతో ఆయన అవకాశం కోల్పోయారు.

## మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతకరం

### స్పీకర్‌ను అవమాననించారంటూ ఆందోళన

### క్షమాపణలు చెప్పాలని డిమాండ్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 12:



సభ మీ సొంతం కాదంటూ స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడడం రచ్చకు దారి తీసింది. ఈ క్రమంలో మంత్రులు సభాపతితో భేటీ అయ్యారు. జగదీష్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని అందరూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. దళిత స్పీకర్‌పై జగదీష్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నానన్నారు. స్పీకర్‌పై ఇంత అహంకారంగా మాట్లాడటం తాను ఎప్పుడూ చూడలేదన్నారు. ప్రజాస్వామ్యంలో స్పీకర్ చైర్‌కు కొన్ని అధికారాలు ఉంటాయని, దీనిపై సీరియస్ నిర్ణయం తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ అన్నారు. జగదీష్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మంత్రి శ్రీధర్ రెడ్డి జోక్యం చేసుకుని జగదీష్ రెడ్డి స్పీకర్‌ను బెదిరిస్తున్నారని.. ఆయన చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఏడాదిలో ఏం చేయాలో చేసి తమ సత్తా చూపించామన్నారు. ఏం చేయబోతున్నమో కూడా చెప్పామని శ్రీధర్ బాబు అన్నారు. అనంతరం బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు అసెంబ్లీ లాబీలో చిట్‌చాట్‌గా మాట్లాడారు. స్పీకర్ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని. ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయకపోతే స్పీకర్‌పై అవిశ్వాసం పెడతామన్నారు. నిన్న ముఖ్యమంత్రి అక్షింతలు వేయడం.. ఈరోజు సభలో కాంగ్రెస్ సభ్యులు రెచ్చిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగదీష్ రెడ్డి స్పీకర్‌ను అవమానించలేదని, 'సభ మీ ఒక్కరిదీ కాదు - సభ అందరదీ అని' జగదీష్ రెడ్డి అన్నారని, మీ అనే పదం సభ నిబంధనలకు విరుద్ధం ఎలా అవుతుందని ప్రశ్నించారు. మీ ఒక్కరిదీ అనే పదం అన్ పార్లమెంటరీ పదం కాదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎందుకు నిరసన చేశారో తెలీయదని.. సభను ఎందుకు వాయిదా వేశారో తెలీదని అన్నారు. కాంగ్రెస్ డిపెన్స్‌లో పడిందని, స్పీకర్‌ను కలిశామని, రికార్డు తీయాలని అడిగామన్నారు. దళితుడుని అగౌవరం పరిచే విధంగా జగదీష్ రెడ్డి మాట్లాడలేదన్నారు. 15 నిమిషాల అయినా వీడియో రికార్డు స్పీకర్ తెప్పించలేదని, అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మాట్లాడకుండా బ్లాక్ చేశారని హరీష్ రావు అన్నారు.

## సీఎం రేవంత్‌కు మతిభ్రమించింది



### బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 12:

సీఎం రేవంత్‌రెడ్డికి మతి భ్రమించిందని, ఆయన ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే తెలియడం లేదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్ట్రెచర్ మీద ఉన్నది కేసీఆర్ కాదు, నువ్వు.. అవును ముమ్మాటికీ 'నువ్వే' అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఆర్ఎస్పీ అన్నారు. తన వినూత్న ఆలోచనాయుధాలతో తెలంగాణ సమాజానికి విముక్తి కల్పించి, మరో ప్రపంచం వైపు పరుగులు పెట్టించిన ఆ పోరాట యోధున్ని ఎదుర్కోలేక, కేవలం శాపనార్థాలు అనే స్ట్రెచర్ మీద తెలంగాణ లో తచ్చాడుతున్నది నువ్వు అని రేవంత్‌పై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిప్పులు చెరిగారు. ప్రజలు ఇచ్చిన అరుదైన అవకాశాన్ని వారికోసం వినియోగించే ఇంగింత జ్ఞానం కూడా లేని అజ్ఞానివి నువ్వు. నీ లాంటి వారిని ఉంచాల్సింది సచివాలయం, శాసనసభల్లో కాదు, సైకోలుగా మారిన మనుషులను మార్చే మానసిక చికిత్సాలయాల్లో. కేసీఆర్‌కు మీకు పోలికే లేదు అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. ఏదేమైనప్పటికీ.. నీ లాగా మార్చురీల భాష మాట్లాడే సంస్కృతి బీఆర్ఎస్ పార్టీ నాయకులకు లేదు. కేసీఆర్ కూడా వాటిని ఎంకరేజ్ చేయరని నాకు మెల్లమెల్లగా అర్థమైతున్నది. నేను స్వయంగా చూసిన ఒక విషయం మీకు చెబుతా వినండి. కేసీఆర్ అధ్యక్షతన జరిగిన చాలా పార్టీ సమావేశాల్లో పాల్గొనే అవకాశం నాకు వచ్చింది. ఏ రోజు కూడా ఆయన మీ పేరు ఎత్తి, మీ ప్రస్తావన కూడా తేలేదు. వారి ప్రసంగాలన్నీ ఆద్యంతం తెలంగాణ ప్రజల అమాయకత్వం, ఆవేదన, వారి భవిష్యత్తు, ఇంకా అసంపూర్తిగా ఉన్న ఎన్నో కలలు, బీజేపీ-కాంగ్రెస్ విధానాల వల్ల తెలంగాణ ప్రజలకు అన్ని రంగాల్లో జరుగుతున్న నష్టం, బీఆర్ఎస్ పార్టీ పాటించాల్సిన వ్యూహం, ప్రజలకోసం చేయాల్సిన పోరాటం చుట్టే తిరిగేవి అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. కొంత మంది పార్టీ సీనియర్ సభ్యులు రాష్ట్రం అసమర్థుల చేతుల్లో పడ్డది అని అన్నపుడు, కేసీఆర్ వారిని వారించి "అలా మాట్లాడటం సరి కాదు, ప్రజాస్వామ్యం లో రేవంత్ రెడ్డితో సహా ఎవరికైనా ముఖ్యమంత్రి అయ్యే హక్కుంది, ప్రజల తీర్పును హుందాగా గౌరవించాలి, నిరంతరం వాళ్లను ఎడ్యుకేట్ చేయడమే మనం చేయాల్సిన పని" అని వారు చెప్పడం చూసి నేను ఆశ్చర్యపోయాను. ఇప్పటికైనా సమయం మించిపోలేదు. రోజూ మీరు మీ యాంటీరూంలోకి ఒంటరిగా వెళ్లి అద్దం ముందు నిలబడి గట్టిగా మీ ప్రతిబింబంతో మీ సిగ్నేచర్ మార్చురీ భాష మాట్లాడండి. మీ ప్రతిబింబం నిజంగా నిజాయితీగా ఒప్పుకుంటే అదే భాష ముందు మీ కుటుంబంలో వాడండి.. మారండి లేదా ఆసుపత్రిలో చేరండి అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సూచించారు.



## కావాలనే కాంగ్రెస్ నాయకుల రాద్ధాంతం

### జగదీశ్‌రెడ్డి మాటలను వక్రీకరించే యత్నం : తలసాని

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 12:

అసెంబ్లీలో అందరికి సమాన హక్కులు ఉంటాయన్న జగదీశ్‌రెడ్డి మాటలను కాంగ్రెస్ నాయకులు వక్రీకరిస్తూ, అనవసర రాద్ధాంతానికి తెర తీస్తున్నారని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ సభ్యులే స్పీకర్‌ను అవమానించినట్లుగా మాట్లాడుతున్నారని, ఆ పార్టీ నేతల మాటలు విచిత్రంగా ఉన్నాయని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. సభలో అందరికీ సమాన హక్కులు ఉంటాయన్నారు. స్పీకర్ అంటే తమకు అపారమైన గౌరవం ఉందన్నారు. కేసీఆర్‌కు ఛాంబర్ లేకుండా చేసినా తాము భరించామని.. పీఏసీ చైర్మన్ మాకు వచ్చేదైనా వారే గుంజుకున్నారన్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ స్ట్రెచర్‌పై ఉన్నారని, మార్చురీకి వెళ్తారని ఎలా అంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైనా ఎదుటివారి చావు కోరుకోవడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. గడ్డం ప్రసాద్ గౌరవప్రదమైన పోస్టులో ఉన్నారన్నారు. ఆయనను వ్యక్తిగా చూశామని, ఆయన కులం, మతం చూడలేదన్నారు. తాము సభకు రావొద్దని అనుకుంటున్నారా?.. చెబితే తాము ఆలోచిస్తామన్నారు. ఆ తర్వాత మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. సభలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్నారన్నారని, సభలో అందరూ సమానమే అందరికీ సమాన హక్కులు ఉంటాయన్నారు. తాము స్పీకర్‌ని అమానించలేదన్నారు. నిన్న రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను డైవర్ట్ చెయ్యడానికి ఇవన్నీ మాట్లాడుతున్నారన్నారు. రైతులకి ఇచ్చిన హామీలు ఏమి అమలు చేశారు.. హామీలు అమలు చేయడం లేదని ప్రశ్నించినందుకు మా గొంతు నొక్కాలని చూస్తున్నారన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లోనూ మమ్ములను మాట్లాడకుండా చేసే కుట్ర చేస్తున్నారన్నారు. ఒక్కరూ కాదు 20 మంది ఎమ్మెల్యేలు మంది ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

## ఎంపీలు, ఎమ్మెల్సీ తీరుపై బీజేపీ ఎమ్మెల్సీ రాజాసింగ్ లేఖ విడుదల

### కొందరు నాయకులతో పార్టీకి భారీగా నష్టం

### వారు బయటకుపోతేతప్పిదే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాదు

### రాజాసింగ్ లేఖపై సర్వత్రా చర్చ

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 12:



పార్టీలో కొంతమంది ఎంపీలు, ఎమ్మెల్యేలను టార్గెట్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖను రిలీజ్ చేశారు. తెలంగాణలో ఏ ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వ ముఖ్యమంత్రితో కొందరు నేతలు రహస్య సమావేశాలు పెట్టుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి మీటింగ్లు పెట్టుకుంటే తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఎప్పుడు వస్తుందని ప్రశ్నించారు. కేంద్ర అధికారులు గమనించాలన్నారు. తెలంగాణ హిందూ సేఫ్‌గా ఉండాలంటే తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావాలన్నారు. బీజేపీ గవర్నమెంట్ రావాలంటే పాత సామాను బీజేపీ నుంచి బయటికి వెళ్లి పోవాలన్నారు. కేంద్ర అధికారులు దీనిపైన ఆలోచన చేయాలని కోరారు. ఇది నా పార్టీ.. నా అయ్యా పార్టీ అనేవాళ్లు తెలంగాణలో చాలామంది ఉన్నారన్నారు. వాళ్లని రిటైర్ చేస్తేనే తెలంగాణలో బీజేపీకి మంచి రోజులు వస్తాయన్నారు. ఇది తాను కాదు ప్రతి ఒక్క బీజేపీ సీనియర్ అధికారులు, కార్యకర్తలు ఇదే అనుకుంటున్నారని లేఖలో రాజాసింగ్ పేర్కొన్నారు. గతంలో కూడా బీజేపీని ఒకే సామాజిక వర్గానికి వ్యక్తులు శాసిస్తున్నారని, రాష్ట్ర నాయకత్వం అంతా కూడా రెడ్డి సామాజిక వర్గం చేతిలో ఉందంటూ బాహాటంగానే వ్యాఖ్యలు చేశారు. బీజేపీఎల్పీ నేతగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుని హెూదాలో కిషన్ రెడ్డి ఒకే సామాజికవర్గానికి చెందిన వ్యక్తులు ఉన్నట్లు అప్పట్లోనే రాజాసింగ్ లేఖ రాశారు. దీనిపై బీజేపీ జాతీయ నాయకత్వం పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. అలాగే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పార్టీలో సముచిత స్థానం ఇస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ధీటుగా ఎదిగే అవకాశం ఉంటుందని నెలరోజుల క్రితం రాజాసింగ్ విడుదల చేసి లేఖ కూడా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలు కొనసాగిస్తుండగా కొంతమంది బీజేపీ పార్టీ నుంచి పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు రహస్యంగా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో సమావేశం అవుతున్నారని, ఇది బీజేపీకి మంచిది కాదన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే బీజేపీ రాష్ట్ర నాయకత్వంలో మొదటి నుంచి పేరుకుపోయిన చాలా మంది నేతలను పార్టీ నుంచి బయటకు పంపించి వేయాలని, వాళ్లని పార్టీ నుంచి బహిష్కరించాలన్నారు. దాంతో పాటుగా పార్టీని తమ అయ్య జాగీరుగా భావిస్తున్న వారు బీజేపీలో చాలా మంది ఉన్నారని, వారంతో కొన్ని సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులే అంటూ ఆరోపణలు చేస్తూ లేఖను రిలీజ్ చేశారు రాజాసింగ్. అలాగే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నవారి వివరాలు తనకు తెలుసని.. వారిపై త్వరలోనే బీజేపీ జాతీయ నాయకత్వానికి ఫిర్యాదు చేయబోతున్నట్లు లేఖలో పేర్కొన్నా రాజాసింగ్. దీనిపై రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది.


# నూడుల్స్ తిని కాలం వెళ్లబుచ్చాం..

## • పాత జ్ఞాపకాలు నెమరేసుకున్న దియామిర్జా

కెరీర్ బిగినింగ్‌లో సవాళ్లు ఎదుర్కోవడం ఎలాంటి ఆర్టిస్ట్‌కైనా సహజమే. ఇప్పుడు ఎంత పెద్ద స్టార్ అయినా కావచ్చు కెరీర్ బిగినింగ్‌లో ఇబ్బందులు సహజంగానే ఉంటాయి. మోడలింగ్‌లోకి అడుగుపెట్టిన సమయంలో తాను ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నట్లు చెప్పారు నటి దియా మిర్జా. ఆ సమయంలో చేతిలో డబ్బుల్లేక ఇబ్బందిపడ్డానని అన్నారు. '2000లో నేను, ప్రియాంకా చోప్రా, లారా దత్తా.. మిస్ ఇండియా పోటీల్లో పాల్గొన్న విషయం అందరికీ తెలిసిందే. ప్రియాంకకు కుటుంబ సభ్యుల నుంచి ఎంతో సపోర్ట్ ఉండేది. మాకు సపోర్ట్ చేయడానికి ఎవరూ ఉండేవారు కాదు. మోడలింగ్‌లో రాణిస్తోన్న కారణంగా అప్పటికే లారా ముంబయిలో ఒక ఇరికింట్లో అద్దెకు ఉండేది. నేను ముంబయి వచ్చినప్పుడు.. ఆమె నాకెంతో సాయంగా నిలిచింది. తన రూమ్‌లో ఉండేందుకు అవకాశం కల్పించింది. చిన్న ఇల్లే అయినప్పటికీ మేమిద్దరం సర్దుకుపోయాం. ఫ్యాషన్ షోల్లో పాల్గొని.. ఖరీదైన దుస్తులు ధరించి నప్పటికీ ఒక్కోసారి చేతిలో చిల్లిగవ్వ ఉండేది కాదు. చాలీచాలని డబ్బుతోనే జీవితాన్ని కొనసాగించాం. కొన్నిసార్లు నూడుల్స్ తిని కడుపు నింపుకున్నాం. అలా చాలా రోజులు గడిపాం.



# ఇండస్ట్రీకి వచ్చి స్థిరపడని వారికి అండగా .. కిరణ్ అబ్బవరం




యువ కథనాయకుడు కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం దిల్‌రుబా. ఈ సినిమాకి విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తుండగా.. రవి, జోజో, జోస్, రాకేష్ రెడ్డి నిర్మిస్తున్నారు. రుక్సర్ థిల్లాన్ కథానాయికగా నటిస్తుండగా.. మార్చి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది చిత్రయూనిట్. అయితే ఈ వేడుకలో కిరణ్ మాట్లాడుతూ.. ఇండస్ట్రీకి వచ్చి ఇబ్బంది పడుతున్న వారికి నేను తోడుంటానని తెలిపాడు. హైదరాబాద్‌లోని కృష్ణ నగర్‌కి నేను వచ్చినప్పుడు నాతో పాటు 50 మంది ఉండేవాళ్లం. అందరం కలిసి పనిచేయాలని చెప్పి బావార్చి దగ్గర కలిసేవాళ్లం. స్టోరీలు చెప్పుకునేవాళ్లం. అయితే రోజురోజుకి మా సంఖ్య తగ్గి 50 నుంచి 10కి పడిపోయింది. ఇప్పుడయితే ఇద్దరు ముగ్గురు కూడా కనిపించట్లేదు. దీనికి కారణం ఏంటి అంటే అవకాశలు రావడం. అవకాశం వచ్చిన వాళ్లు ఇక్కడనే సెటిల్ అవుతారు. కానీ అవకాశలు రాకుండా అలానే మిగిలిపోయిన వాళ్లు ఇంటికివెళ్లిపోతున్నారు.

# రాబిన్‌హుడ్‌లో క్రికెటర్ డేవిడ్ వార్నర్

హిట్టు ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా వరుస సినిమాలు చేసుకుంటూ వెళుతున్నాడు నటుడు నితిన్. ఇప్పుడు ఆయన ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం రాబిన్‌హుడ్. ఈ సినిమాకు వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్నాడు. భీష్మ సినిమా తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ సందర్భంగా వరుసగా ప్రమోషన్స్ నిర్వహిస్తుంది చిత్రయూనిట్. యితే సినిమాలో ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ నటించబోతున్నాడని చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. డేవిడ్ ఈ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. అయితే రాబిన్ హుడ్ ప్రమోషన్స్‌లో డేవిడ్ వార్నర్ కూడా పాల్గొంటాడని దర్శకుడు వేణు తాజాగా తెలిపాడు. ఇక డేవిడ్ ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌లో పాల్గొంటాడ లేదా నేరుగా ప్రీ రిలీజ్ వేడుకకు వస్తాడా అనేది తెలియాల్సి ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల కథానాయికగా నటిస్తుంది. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఈ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్న డేవిడ్ వార్నర్




# కార్తీక్ ఆర్యన్‌తో శ్రీలీల డేటింగ్..




బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్, నటి శ్రీలీల డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొన్ని రోజుల నుంచి బీటౌన్‌లో ప్రచారం జరుగుతోంది. కార్తిక్ ఫ్యామిలీ పార్టీలో శ్రీలీల పాల్గొనడంతో ఈ వార్తలు తెరపైకి వచ్చాయి. ఇదిలాఉండగా, తమ ఇంటికి ఎలాంటి అమ్మాయి కోడలిగా రావాలో తెలియజేస్తూ కార్తిక్ ఆర్యన్ తల్లి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఐఫా' వేడుకల్లో పాల్గొన్న ఆమెను నిర్మాత కరణ్‌జోహార్ కాబోయే కోడలి గురించి ప్రశ్నించారు. 'ఒక మంచి వైద్యురాలు మా ఇంటికి కోడలిగా రావాలని మేమంతా కోరుకుంటున్నాం' అని ఆమె తెలిపారు. నటిగా రాణిస్తోన్న శ్రీలీల.. ప్రస్తుతం ఎంబీబీఎస్ చదువుతోన్న విషయం తెలిసిందే. చదువుతోపాటే కెరీర్‌లోనూ కొనసాగడంపై ఎన్నో సందర్భాల్లో ఆమె ఆనందం వ్యక్తం చేశారు. కార్తిక్ - శ్రీలీల డేటింగ్‌లో ఉన్నారంటూ ప్రచారం జరుగుతోన్న వేళ హీరో తల్లి వ్యాఖ్యలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. శ్రీలీలను ఉద్దేశించే ఆమె ఈ వ్యాఖ్యలు చేశారని పలువురు భావిస్తున్నారు. దక్షిణాదిలో హీరోయిన్‌గా గుర్తింపుతెచ్చుకున్న శ్రీలీల.. బాలీవుడ్‌లో తన సత్తా చాటుకునేందుకు సిద్ధమయ్యారు. అనురాగ్ బసు దర్శకత్వంలో ఆమె ఓ సినిమా చేస్తున్నారు. ఆ సినిమాలో కార్తిక్ ఆర్యన్ హీరోగా నటించడం విశేషం. ఈ సినిమా చిత్రీకరణ సమయంలోనే కార్తిక్ - శ్రీలీల మధ్య పరిచయం ఏర్పడిందని.. దీంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ కొంతమంది మాట్లాడుతున్నారు.

